క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ పోస్టర్ ఆవిష్కరణ

మార్కాపురం టౌన్: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు కార్యక్రమానికి సంబంధించి పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్‌కాలనీలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

ఆలయాలు మూసివేత



మూతపడిన చెన్నకేశవస్వామి ఆలయం

మార్కాపురం టౌన్: చంద్రగ్రహణం సందర్భంగా పట్టణంలోని ఆలయాలు ఆదివారం మూసివేశారు. పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, అల్లూరి పోలేరమ్మ ఆలయం, కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, సత్యనారాయణ స్వామి గుడి, విఘ్నేశ్వరస్వామి ఆలయం, ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయాలు మూతపడ్డాయి. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం స్వామివారి దర్శనానికి అనుమతిస్తామని ఆలయ కమిటీల ప్రతినిధులు తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ జాతర



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

పొదిలి రూరల్: మండలంలోని ఈగలపాడులో గ్రామ దేవత పోలేరమ్మ, అంకమ్మ, పోతురాజు స్వామి జాతర ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నెల పొంగళ్లు, పోలేరమ్మ తల్లి జాతర మహోత్సవం సందర్భంగా బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆలయ పరిసరాల్లో సహపంక్తి భోజనాలు చేశారు.

ఆర్‌ఓబీపై టిప్పర్ బీభత్సం



రైలింగ్‌ను ఢీకొని నిలిచిన టిప్పర్

మార్కాపురం: మార్కాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జిపై టిప్పర్ అదుపుతప్పి రైలింగ్‌ను ఢీకొని గాలిలో నిలిచింది. మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు కథనం ప్రకారం.. మార్కాపురం నుంచి చీమకుర్తికి వెళ్తున్న టిప్పర్ లారీ డ్రైవర్ పచ్చ శ్రీనివాసులు ఆదివారం వేకువజామున మార్కాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి పైకి రాగానే నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో టిప్పర్ అదుపుతప్పి రైలింగ్‌ను ఢీకొని ఆగింది. ఒక్క అడుగు ముందుకు వెళ్లినా 20 అడుగుల ఎత్తు నుంచి కిందపడి పెను ప్రమాదమే జరిగేది. అదృష్టవశాత్తు టిప్పర్ ఆగిపోవడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

అల్లూరి పోలేరమ్మకు పూజలు



ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ తల్లికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లోని పుట్ట, నాగశిలలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

పోస్టింగులేవ్.. ఊస్టింగులే!

- చిరుద్యోగుల పొట్టకొట్టిన కూటమి నాయకులు
- బలవంతంగా ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, ఎండీయూ ఆపరేటర్లు, కుకింగ్ ఏజెన్సీల తొలగింపు
- మేనిఫెస్టోలో హామీలను గాలికొదిలేసి నిరుద్యోగులకు శఠగోపం



కర్నూల్ వెళ్లి పింఛను ఇస్తున్న వలంటీర్ నాగరాజు(ఫైల్)

బేస్తవారిపేట:

'మేము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామ'ని ఎన్నికల వేళ వల్లెవేసిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక చిరుద్యోగుల పొట్టకొట్టారు. ఏళ్ల తరబడి చిరుద్యోగాలనే నమ్ముకున్న వారి కుటుంబాలను రోడ్డున పడేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త ఉద్యోగాలు కల్పించడమేమో కాని ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టారు. ఎన్నికల సమయంలో కొత్త ఉద్యోగాలు కల్పిస్తామని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని, ఎక్కడికక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ఊరూరా గడప గడప తిరిగి ప్రచారం చేసిన కూటమి నాయకులు నేడు ఉద్యోగాల కల్పనపై కిమ్మనడం లేదు.

వలంటీర్ వ్యవస్థతో మొదలు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశ వ్యాప్తంగా ఎంతో పేరుపొందింది. కరోనా సమయంలోనూ వలంటీర్లు ఎనలేని సేవలు అందించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు రూ.10 వేలు ఇస్తామని, వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే మాట మార్చారు. వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి వారి కుటుంబాలను రోడ్డున పడేశారు.

ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం నిలిపేయడంతో వందలాది మంది చిరుద్యోగులు వీధినపడ్డారు. వాహనాలకు ఈఎంఐలు కూడా చెల్లించలేని స్థితిలోకి ఆపరేటర్లు చేరుకున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు

ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మేట్లను అన్యాయంగా తొలగించారు. ఎటువంటి తప్పులు చేయకపోయిన భారీ జరిమాన వేస్తామని చెప్పి బలవంతంగా అధికారులతో భయపెట్టి రాజీనామా చేయించారు. కనీసం వీరిని ఉపాధి హామీ పనులకు కూడా రానివ్వకుండా అడ్డుకుంటున్నారు. గ్రామంలో లేని వ్యక్తులకు హాజరు వేస్తూ భారీగా అవినీతికి పాల్పడుతున్నారు.

యానిమేటర్ల తొలగింపు..

ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పాటించకుండా డ్వాక్రా యానిమేటర్లను తొలగించారు. కనీసం సమావేశాలు పెట్టకుండానే ఇష్టారాజ్యంగా యానిమేటర్లను తొలగించినట్లు తీర్మానాలు పెట్టుకుంటున్నారు. తద్వారా గ్రామ సమాఖ్యలో నిధులు గోల్‌మాల్ చేస్తున్నారు. కొందరు యానిమేటర్లు కోర్టుకు వెళ్లి తమకు అనుకూలంగా తీర్పులు తెచ్చుకున్నప్పటికీ లెక్కచేయని పరిస్థితి.

ప్రైవేట్ వ్యక్తులకు మద్యం దుకాణాలతో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మద్యం దుకాణాల్లో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేట్ వ్యక్తులకు మద్యం విక్రయాలకు అనుమతులు ఇచ్చింది. దీంతో మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న నిరుద్యోగులు రోడ్డున పడ్డారు.

గిద్దలూరు నియోజకవర్గంలో తొలగించిన చిరుద్యోగుల వివరాలు

వలంటీర్లు	1545
ఎండీయూ వాహనాల సిబ్బంది	53
మద్యం దుకాణాల్లో సిబ్బంది	94
వీఓఏలు	11
ఫీల్డ్ అసిస్టెంట్లు	47

ఇంత దుర్మార్గాన్ని ఏనాడూ చూడలేదు



గత 12 సంవత్సరాలుగా పందిళ్లపల్లెలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నా. ఎటువంటి తప్పు చేయకపోయినా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బలవంతంగా రాజీనామా చేయించారు. ఇలాంటి దుర్మార్గాన్ని ఏనాడు చూడలేదు. ఈ చిరుద్యోగంపై ఆధారపడి మా కుటుంబం జీవిస్తోంది. ఈ ప్రభుత్వం నిర్ధాక్షిణ్యంగా మా పొట్టకొట్టింది.

– తోటకూరి ఏలియా, ఫీల్డ్‌అసిస్టెంట్, పందిళ్లపల్లె

రోడ్డున పడేశారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామన్నారు. ఉద్యోగం లేకపోతే నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని చెప్పారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న మాలాంటి వారిని తొలగించడంతో రోడ్డున పడ్డాం. కూటమి ప్రభుత్వం చెప్పేది ఒకటి చేసేది ఒకటి.

– దూదేకుల మీరాహుస్సేన్, బేస్తవారిపేట

రైతులకు శాపంగా కూటమి ప్రభుత్వం



కొమరోలులో అన్నదాత పోరు వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వెంకటనాయుడు, పార్టీ నాయకులు



అర్ధవీడులో అన్నదాత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

- జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు

కొమరోలు: రాష్ట్రంలోని రైతులకు కూటమి ప్రభుత్వ పాలన శాపంగా మారిందని కొమరోలు మండల జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు విమర్శించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను కొమరోలులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రైతన్నల సమస్యలను గాలికి వదిలివేసిందని, 9వ తేదీన మార్కాపురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రైతన్నలకు అండగా నిరసన తెలుపుతున్నామన్నారు. కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. రైతులు వేసిన పంటలకు కావలసిన యూరియా సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఎం.రవికుమార్, వైస్ ఎంపీపీ షేక్ మౌలాలి, ఎంపీటీసీ సభ్యులు షేక్ సుభాని, తిరుపతిరాజు, పార్టీ నాయకులు బంగారు విశ్వరూపం, గోల్కొండ సుబానీ, వెంగయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరును విజయవంతం చేయాలి

అర్ధవీడు: మార్కాపురంలో ఈనెల 9న చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీపీ మేడూరి వెంకట్రావు కోరారు. ఆదివారం అన్నదాత పోరు పోస్టర్లు ఆవిష్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని విధాలుగా రైతులు ఇబ్బందులకు గురై నష్టపోతున్నారన్నారు. రైతులకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు నన్నెబోయిన రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు ఏరువ రంగారెడ్డి, సర్పంచ్ మునగాల వసంతమ్మ, నాయకులు రబ్బాని, జిలాని, అల్లబకాష్, రఘు, నాసర్ వలి, అంబిరెడ్డి, ఏరువ కృష్ణారెడ్డి, బాంబేవలి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు దొరక్క నిరుద్యోగుల అవస్థలు



వేకువజామున 4.30 గంటల సమయంలో బస్టాండ్‌లో వేచిఉన్న నిరుద్యోగ అభ్యర్థులు

- ఒంగోలులో పరీక్షకు వెళ్లేందుకు బస్టాండ్‌లో పడిగాపులు
- సొమ్ము చేసుకున్న ప్రైవేటు వాహనదారులు



ఉదయం 7 గంటల సమయంలో ఒంగోలు బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న అభ్యర్థులు

మార్కాపురం: ఒంగోలులో ఆదివారం నిర్వహించిన ఫారెస్టు బీట్ ఆఫీసర్ల ఎగ్జామ్‌కు మార్కాపురం, పెద్దారవీడు, దోర్నాల, యర్రగొండపాలెం, తర్లుపాడు, త్రిపురాంతకం ప్రాంతాల నుంచి హాజరయ్యేందుకు వేకువజామున 4.30 గంటలకు మార్కాపురం ఆర్టీసి బస్టాండుకు నిరుద్యోగ అభ్యర్థులు వచ్చారు. అయితే ఒంగోలుకు బస్సులు లేకపోవడంతో సకాలంలో చేరగలమో లేదోనని ఆందోళన చెందారు. నిరుద్యోగుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ వాహనదారులు ఒంగోలుకు 350 నుంచి 400 రూపాయలు వసూలు చేశారు. సుమారు 300 నుంచి 400 మంది అభ్యర్థులు ఆదివారం ఉదయం ఒంగోలులో జరిగిన పరీక్షకు వెళ్లేందుకు మార్కాపురం ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్నారు. వచ్చిన ఫస్టు బస్సులో ఎక్కువ సంఖ్యలో మహిళలు ఎక్కడంతో మిగిలిన వారికి అవకాశం లేకుండా పోయింది. స్త్రీశక్తి పథకం ప్రవేశపెట్టిన తరువాత మార్కాపురం నుంచి ఒంగోలుకు నేరుగా వెళ్లే పలు బస్సులను రద్దు చేశారు. పొదిలి వరకు మాత్రమే బస్సులను నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో సకాలంలో ఒంగోలుకు వెళ్లలేమోనన్న ఆందోళనతో పలువురు అభ్యర్థులు కార్లు బాడుగకు మాట్లాడుకుని వెళ్లారు. ఒక్కొక్కరు 400 రూపాయల వరకు చార్జీ రూపంలో చెల్లించారు. తగినన్ని ఆర్టీసి బస్సులను ఒంగోలుకు నేరుగా ఏర్పాటు చేసి ఉంటే తమకు అదనపు భారం తప్పేదని నిరుద్యోగులు అభిప్రాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ డీఎం నరసింహులు ఒంగోలుకు 2 స్పెషల్ బస్సులను ఏర్పాటు చేయగా.. ఉదయం 7 గంటల సమయంలో కూడా ఒంగోలు బస్సు నిరుద్యోగ అభ్యర్థులతో కిక్కిరిసిపోయింది.

అన్నదాత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: రాష్ట్రంలో రైతులు యూరియా, ఎరువులు దొరక్క ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 9న డివిజన్ కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమానికి రైతులు హాజరై జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మార్కాపురంలో మీడియాతో మాట్లాడుతూ.. రైతే దేశానికి వెన్నెముక అని, అలాంటి రైతులు ప్రస్తుతం అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గడచిన ఐదేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు సకాలంలో రైతులకు అందాయని, గిట్టుబాటు ధరలు కూడా లభించాయన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో ఎరువుల కోసం రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందడం లేదన్నారు. ఈ నేపథ్యంలో రైతుల సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 9న మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే కార్యక్రమానికి గిద్దలూరు నియోజకవర్గం నుంచి రైతులు, పార్టీ శ్రేణులు హాజరై జయప్రదం చేయాలని కేపీ నాగార్జునరెడ్డి కోరారు.

ఒక వైపు ఉక్కపోత.. మరో వైపు కరెంటు కోత!

- అల్లాడిపోతున్న ప్రజలు



ఆదివారం మధ్యాహ్నం ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న కోర్టు సెంటర్

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో వారం రోజుల నుంచి ఎండలు మండిపోతున్నాయి. మరో వేసవిని తలపిస్తున్నాయి. ఇదే సమయంలో రోజూ కరెంటు కోత ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. రోజూ ఏదొక సమయంలో విద్యుత్ అధికారులు సబ్‌స్టేషన్ల మరమ్మతుల పేరుతో కోత విధిస్తున్నారు. ప్రతి శని, ఆది వారాల్లో సబ్‌స్టేషన్ల మెయింటెనెన్స్ పేరుతో విధిస్తున్న కోతకు అదనంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. పీక్ అవర్స్‌లో విద్యుత్‌కోత ఉండటంతో అటు వ్యాపారులు, ఇటు ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. పైగా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో ఏసీలు, ఫ్రిజ్‌లు, కూలర్ల వాడకం ఎక్కువైంది. విద్యుత్ డిమాండ్ కూడా రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో అధికారులు అనధికారికంగా విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారు. గత మూడు రోజుల నుంచి మార్కాపురం పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో రాత్రిపూట గంట నుంచి రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఈ నెల 4, 5, 6వ తేదీల్లో పట్టణంలోని పలు ప్రాంతాల్లో వివిధ సమయాల్లో పగలు, రాత్రి పూట విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం వేళ ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు బయటకు రావాలంటేనే జడుసుకుంటున్న పరిస్థితి. ఆదివారం 34 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా శనివారం 33 డిగ్రీలు, శుక్రవారం 34 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పట్టణంలోని ప్రధాన వీధులైన ఆర్టీసీ బస్టాండు, కంభం రోడ్డు, పాత బస్టాండు, కోర్టు సెంటరు, తర్లుపాడు రోడ్డు, నాయుడు బజారు, దోర్నాల సెంటరు తదితర ప్రాంతాలన్నీ మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా మారాయి.

ఆలయ మార్గం అధ్వానం



ఘాట్ రోడ్డు ముఖద్వారం వద్ద పెరిగిన చిల్లచెట్లు



నడిచి వెళ్లేందుకు వీలులేకుండా పెరిగిన చిల్లచెట్లు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కొండమీద గల లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే మార్గం చిల్లచెట్లతో అధ్వానంగా తయారైంది. పట్టణంలోని స్టేట్ బ్యాంక్ నుంచి మెట్ల మార్గం దారుణంగా ఉండటంతో మున్సిపల్ నిధులతో 2018లో రాజానగర్ నుంచి ఆలయానికి ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కొన్ని రోజుల తర్వాత ఆ రోడ్డు పూర్తిగా చిల్లచెట్లతో నిండిపోవడంతో దాతల సహకారంతో మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం ఘాట్ రోడ్డు పరిస్థితి మొదటికొచ్చింది. అధికారులు స్పందించి ఆలయానికి వెళ్లే మార్గాన్ని బాగు చేయించాలని భక్తులు కోరుతున్నారు.

ప్రవక్త జీవితం ముస్లింలకు మార్గదర్శకం



మాట్లాడుతున్న ఇలియాజ్ ఉల్ ఖాద్రి

కంభం: మహమ్మద్ ప్రవక్త జీవితం ముస్లింలకు మార్గదర్శకమని కర్ణాటకకు చెందిన ప్రముఖ వక్త ఇలియాజ్ ఉల్ ఖాద్రి పేర్కొన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ×మస్జిద్–ఎ– హసన్¥ మసీదు ఆధ్వర్యంలో ఆదివారం మిలాద్ ఉన్ నబి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖాద్రి మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త ×రసూలుల్లాహ్ సొల్లల్లాహువలైహివసల్లం¥ జీవిత విశేషాలను వివరించారు. దైవం మానవులకు మార్గం చూపడానికి మానవోత్తములను ప్రవక్తలుగా ఎన్నుకొని వారిపై దివ్యాంశృతిని అవతరింపజేస్తారన్నారు. ముస్లింలు ప్రవక్త చూపిన మార్గాన్ని అనుసరిస్తూ అల్లాహ్ అనుగ్రహం పొందాలన్నారు. మాటల ద్వారా, చేతల ద్వారా ఇతరుల మనసులు నొప్పించరాదన్నారు. ఒంటరిగా ఉన్నా నలుగురిలో ఉన్నా దైవానికి భయపడాలన్నారు. ముస్లింలు సమాజంలో సత్ప్రవర్తనతో నడుచుకుంటూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

ఘనంగా సత్యసాయి జయంతి



రక్తదానం చేస్తున్న సత్యసాయిసేవా సమితి నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: భగవాన్ సత్యసాయి జయంతి వేడుకలను పట్టణంలోని రేడియో బావి సమీపంలో గల సత్యసాయి మందిరం ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం మందిరం ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సమితి మండల కన్వీనర్ ఎస్.అనంతరామయ్య, సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రి యజ్ఞం

పౌర్ణమి సందర్భంగా గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో పట్టణంలోని కాశినాయన కుంట ఆవరణలో గల గాయత్రిమాత ఆలయంలో భక్తి శ్రద్ధలతో యజ్ఞం నిర్వహించారు. గాయత్రి పరివార్ సభ్యులు పి.హనుమంతారెడ్డి మాట్లాడుతూ.. సమస్త మానవాళి సంరక్షణ కోసం యజ్ఞం నిర్వహించినట్లు పేర్కొన్నారు.